సాక్షి
సూర్యాపేట
శుక్రవారం, 20, జనవరి, 2023



'తలసేమియా'తో తీరని శోకం

తిమ్మారెడ్డిగూడేనికి చెందిన వింజమూరి యశ్వంత్ తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. - 8లో



బౌద్ధమే శరణ్యం

సమాజ రుగ్మతల నివారణకు బౌద్ధమే శరణ్యమని సంఘసేన మహాథేర అన్నారు. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30°/17°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదంగా, రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి ఆలయంలో గురువారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీసమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా అర్చకులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో . ప్రాతఃకాలార్చన, సుప్రభాత సేవ, నిత్యఅగ్నిహోత్రి, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రక్తికట్టించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం , మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు వేదమంత్రోచ్ఛరణాలతో కల్యాణతంతు ముగించారు. నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు విజయ్‌కుమార్, నవీన్, లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

26న రైతు సంఘాల నిరసన ప్రదర్శన



మాట్లాడుతున్న కోటేశ్వర్‌రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఈనెల 26న రైతు సంఘాల నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ప్రజా సంఘాల బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గత సంవత్సరం జనవరి 26న ఢిల్లీలో శాంతియుతంగా ట్రాక్టర్స్ ర్యాలీ నిర్వహిస్తున్న రైతులపై బాష్ప వాయువు ప్రయోగించి, లాఠీచార్జి చేసి, వాహనాలు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ ఆ రోజున ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆ పోరాటం ఫలితంగానే నల్ల చట్టాలు రద్దయ్యాయన్నారు. కానీ రైతు వ్యతిరేక చట్టాల రద్దు సందర్భంగా రైతులపై కేసులు ఎత్తివేస్తామని, చనిపోయిన రైతులకు ఎక్స్ గ్రేషియా చెల్లిస్తామని, మద్దతు ధరల చట్టాన్ని అమలు చేస్తామని హామీలు ఇచ్చినా అవి నేటికీ నెరవేరలేదన్నారు. ఈనెల 31 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో రైతులకు కనీసం మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని కోరారు .ఈ సమావేశంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య , ఏఐకేఎమ్ఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీవైఎల్ జిల్లా కార్యదర్శి కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కిరణ్ పాల్గొన్నారు

నిరుపేద దళితులకే ప్రాధాన్యమివ్వాలి

హుజూర్‌నగర్ : దళితబంధు పథకంలో నిరుపేద దళితులకే మొదటి ప్రాధాన్యమివ్వాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.రవికుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.బాబు కోరారు. ఫిబ్రవరి 3న చేపట్టే కలెక్టరేట్‌ల వద్ద ధర్నా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దళితబంధు కోసం దళితుల ఆత్మగౌరవాన్ని ఎమ్మెల్యే ముందు తాకట్టు పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 3న చేపట్టే ధర్నా కార్యక్రమంలో దళితులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మణ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.నాగరాజు, నాయకులు కె.రామయ్య, కె.పెంటయ్య, కె.జానయ్య, డి.రమేష్, వి.జయరాజ్, ఎం.వెంకటేశ్వర్లు, ఆర్.నాగరాజు, కె.సుధాకర్, పి.వెంకటనారాయణ, సీహెచ్.సైదులు పాల్గొన్నారు.

'యాదాద్రి'లో శాస్త్రోక్త పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నిత్య పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి.వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీ దళాలతో అర్చించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఇక ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ, సహస్రనామార్చన, రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. వివిధ పూజల ద్వారా స్వామి వారికి నిత్యాదాయం రూ.19,65,432 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

క్రీడలతో మానసికోల్లాసం

చివ్వెంల(సూర్యాపేట) : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.గౌతం ప్రసాద్ అన్నారు. ఈనెల 26 జరగనున్న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాకోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యారమ్, చెస్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి సీనపల్లి సోమేశ్వర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



క్యారమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గౌతం ప్రసాద్

గోదావరి జలాల నిలిపివేత

అర్వపల్లి: జిల్లాకు వస్తున్న గోదావరి జలాలను గురువారం నిలిపివేశారు. యాసంగి సీజన్‌కుగాను గతనెల 26న నీటిని విడుదల చేశారు. వార బందీ విధానం అమలు చేస్తున్నందున ఈ నెల 25 వతేదీ తర్వాత తిరిగి నీటిని పునరుద్ధరించనున్నట్లు అధికారులు తెలిపారు.

మొరాయిస్తున్న సర్వర్

- ఎన్‌ఎంఎంఎస్ యాప్ వినియోగంలో చిక్కులు
- సాంకేతిక సమస్యలతో సేవలకు అంతరాయం
- నమోదుకాని ఉపాధి కూలీల హాజరు
- రోజంతా పనిచేసినా అందని డబ్బులు



నాగారంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మండలాలు	23
గ్రామ పంచాయతీలు	475
జాబ్‌కార్డులు	2,65,106
నమోదైన కూలీల సంఖ్య	6,16,057
పనికి వెళ్లే వారి సంఖ్య	2,91,756
ప్రస్తుతం పనికి వెళ్తున్న వారి సంఖ్య	7,000

నాగారం : జాతీయ ఉపాధిహామీ పథకంలో నూతనంగా అమలు చేస్తున్న హాజరు విధానంతో కూలీలు ఇబ్బందులు తప్పడంలేదు. నిత్యం సర్వర్ మొరాయిస్తుండటంతో కూలీల హాజరు నమోదు కావడం లేదు. రోజంతా శ్రమించి పనిచేసినా కూలి డబ్బులకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. గతంలో రాతపూర్వంగా వేసే హాజరు స్థానంలో ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) యాప్ తీసుకొచ్చారు. ఈ ఏడాది నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

పారదర్శకత కోసమే..

ఉపాధి పనుల్లో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్ యాప్ తీసుకొచ్చింది. పాత విధానంలో లొసుగులను ఆసరా చేసుకొని కొందరు సిబ్బంది ఇష్టాను సారంగా వివరాలు నమోదు చేసేవారు. కూలీలు రాకున్నా వచ్చినట్లు వేయడం, పనులు కాకున్నా పూర్తి చేసినట్లు చూపడం, కొలతల్లో తేడాలు వంటివి సామాజిక తనిఖీల్లో బహిర్గతమయ్యాయి. కొత్త యాప్ ద్వారా కూలీల ఫొటోలను వారు పని చేసే చోటే తీసి ఆన్‌లైన్‌లో పొందుపర్చుతున్నారు. ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో ఉదయం , సాయంత్రం కూలీల హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఉదయం హాజరు నమోదులో అంతగా ఇబ్బందులు లేకున్నా సాయంత్రం వేళల్లో సర్వర్ మొరాయిస్తోంది. ఒకవేళ ఆన్‌లైన్‌లో ఒక్కపూట హాజరు వేయకున్నా ఆ రోజు డబ్బులు చెల్లించరు.

క్షేత్రస్థాయిలో..

ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదయం హాజరు పడితే సాయంత్రం పడటం లేదు. సిగ్నల్స్ ఎప్పుడు ఉంటాయో, ఎప్పుడు పోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో ఒక వర్క్‌ఐడీ కింద పనిచేస్తున్న కూలీల సంఖ్య 20 మంది దాటితే ఆ గ్రూప్ ఫొటో యాప్‌లో నమోదు చేసేవారు. ఇప్పుడు ఒక్కో వర్క్ ఐడీ కింద ఒక్కొక్కరి చిత్రం అప్‌లోడ్ చేయాలి. అంతే కాకుండా ఒక కూలీ మొదటి హాజరును నమోదు చేసిన నాలుగు గంటల తర్వాతే రెండో హాజరు తీసుకోవాలి. లేదంటే తీసుకోదు. అలాగే ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సుమారు 7వేల మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు. వేసవి కాలంలో మూడు నెలల పాటు నిత్యం లక్ష మందికి పైగానే ఉపాధి పనులకు వెళ్తారు. ఇంత మంది హాజరు నమోదు చేసుకోవడం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇబ్బందే. కొందరు ఉదయం పనులకు వచ్చి సాయంత్రం రావడం లేదు. తాము డబ్బులు పోగొట్టుకుంటున్నామనే విషయం వారికి తెలియడం లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో సాంకేతిక సమ్యలు తలెత్తడంతో ఉపాధి కూలీల హాజరు నమోదులో ఇబ్బంది ఎదురవుతున్నాయి. ఈ విషయంపై ఇప్పటికే జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎంవోఆర్డీ) ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. కూలీలకు రెండు పూటల హాజరు నమోదైతేనే డబ్బులు వస్తాయి. సర్వర్‌లో సాంకేతిక సమస్యను గుర్తించేందుకు ఎంవోఆర్డీ వారు పరిశీలిస్తున్నారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుంది.

కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ, సూర్యాపేట

సవాల్‌గా మారిన హాజరు నమోదు

జిల్లాలో సుమారు 384 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. వారికి సహాయంగా మరికొందరు మేట్లు ఉన్నారు. ప్రస్తుతం తక్కుగా కూలీలు పనులకు వస్తున్నా హాజరు నమోదు సవాల్‌గా మారింది. ఇక వచ్చే వేసవి కాలంలో ఉపాధి కూలీల సంఖ్య పెరుగుతుంది. ఎక్కువ మంది కూలీలు ఉన్నప్పుడు ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో హాజరు నమోదు ప్రక్రియలో సర్వర్ ఇలాగే మొరాయిస్తే ఇబ్బందులు తప్పవు. వేసవి కాలంలో కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించడానికి వీలు లేకుండా పోయే అవకాశం ఉంది.

కంటి వెలుగుతో తెలంగాణ రోల్‌మోడల్



కుడకుడ జెడ్పీహెచ్ఎస్‌లో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఎంపీ బడుగుల, డీఎంహెచ్ఓ కోటాచలం, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

- ఉమ్మడి జిల్లాలో 22లక్షల మందికి కంటి పరీక్షలు చేస్తాం
- ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి
- కుడకుడలో కంటి వెలుగు శిబిరం ప్రారంభోత్సవంలో మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమంతో దేశంలోనే వైద్య రంగంలో తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలుస్తుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం కుడకుడ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన కంటి పరీక్షలు చేయించకోగా ఎలాంటి సమస్యలేదని డాక్టర్లు నిర్ధారించారు. అనంతరం కంటి అద్దాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కంటి వెలుగు కార్యక్రమం దేశం మొత్తానికే వెలుగునిస్తుందన్నారు. సాధారణంగా పని చేసుకునే వారు తమ చూపును నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వమే వారి వద్దకు వెళ్లి పరీక్షలు చేసి వారికి చూపును ఇవ్వాలనే ఆలోచనతో సీఎం చేపట్టిన బృహత్తర కార్యక్రమమే కంటి వెలుగు అని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 22లక్షల మందికి పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ , ఆర్డీఓ రాజేంద్ర కుమార్, డీఎంహెచ్ఓ కోటాచలం, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, స్థానిక కౌన్సిలర్ వేములకొండ పద్మ, డిప్యూటీ డీఎంహెచ్ఓ హర్షవర్ధన్, హెల్త్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, కౌన్సిలర్ బాషమియా తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

తొలిరోజు 6,549 మందికి కంటి పరీక్షలు

జిల్లా వ్యాప్తంగా 50 బృందాలు 6,549 మందికి కంటి పరీక్షలు నిర్వహించాయి. అందులో 1,256 మందికి రీడింగ్ అద్దాలను అందజేశారు. 677 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలను రికమండ్ చేశారు. ఇవి తయారైన తర్వాత వారి ఇళ్లకు నేరుగా పంపించనున్నారు.

ఎమ్మెల్యే గాదరికి ప్లస్-1 అద్దాలు

నాగారం : నాగారం మండల కేంద్రంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ గురువారం ప్రారంభించారు. శిబిరంలో ఆయనకు డాక్టర్ ఉమ కంటి పరీక్షలు చేశారు. దగ్గరి చూపుకోసం ప్లస్-1 పాయింట్ ఉన్న అద్దాలు అందజేశారు.



కంటి అద్దాలు పెట్టుకొని సెల్‌ఫోన్ చూస్తున్న ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

హామీలను విస్మరించిన కేసీఆర్

సూర్యాపేట రూరల్: సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రామారం, అచ్చతండా, హనుమతండా, యండ్లపల్లి, లాల్‌తండాల్లో రెండో రోజు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు రిజర్వేషన్లు పెంచుతామని ఇచ్చిన హామీని గాలికి వదిలేశారన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన తండా గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించడం లేదన్నారు. రైతు రుణమాఫీని వెంటనే ప్రకటించాలని, దళిత బంధు ప్రతి ఒక్కరికీ అమలు చేయాలన్నారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు అర్హులైనవారికి ఇవ్వాలనిడిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధరావత్ వెంకన్న, గట్టు శ్రీనివాస్, రమేష్‌నాయుడు, షఫీఉల్లా, వెలుగు వెంకన్న, నామ ప్రవీణ్, వల్దాసు దేవేందర్, వేణుగోపాల్‌రెడ్డి, పాలవరపు వేణు, స్వామి నాయుడు, సైదిరెడ్డి పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న పటేల్ రమేష్‌రెడ్డి

బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేస్తాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని, చిత్రంలో జూలకంటి

మునగాల(కోదాడ): కేంద్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ వ్యతిరేక శక్తులతో పనిచేసేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. గురువారం మునగాల మండల కేంద్రంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఉప్పల కాంతారెడ్డి సంస్మరణ సభకు హాజరయ్యేందుకు వచ్చిన ఆయన స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం, బీజేపీ అనుసరిస్తున్న విధానాలతో నేడు దేశానికి పెను ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తున్నామన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మతతత్వ బీజేపీ, మోదీ విధానాలకు వ్యతిరేకంగానే బీఆర్ఎస్ ఉద్భవించిందని ప్రకటించిన కేసీఆర్‌తో కమ్యూనిస్టులు కలిసి పనిచేసేందుకు ముందుకు వచ్చారన్నారు. దీనిలో భాగంగానే ఖమ్మంలో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆవిర్భావ సభ విజయవంతమైందన్నారు. బీజేపీని నిలువరించాలనే ప్రధాన ఎజెండాతో ఆవిర్భవించిన బీఆర్ఎస్ దేశంలోని వివిధ రాష్ట్రాల్లోగల ప్రాంతీయ పార్టీలతో కలసి ప్రత్యామ్నాయ వేదికగా ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. త్వరలో విద్యుత్ చార్జీల యూనిట్ కాస్ట్ పెంచేందుకు కేంద్రం ప్రత్యేక చట్టం తీసుకురాబోతోందన్నారు. ప్రతిపక్ష, ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చెలాయిస్తూ గవర్నర్ వ్యవస్థను కూడా దిగజార్చి వారితో సైతం రాజకీయాలు చేయిస్తోందన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను నోట్లకట్టలతో ఎమ్మెల్యేలు, ఎంపీలను కొనుగోలు చేసి కూలగొట్టే ప్రయత్నాలను బీజేపీ ప్రభుత్వం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 12లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, దళితులకు మూడెకరాల భూమి , డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు, పెండింగ్‌లో ఉన్న ధరణి భూముల సమస్యలు, నిరుద్యోగ భృతి తదితర ఎన్నికల హామీలను అమలుచేయాలని తాము ఇప్పటికే సీఎం కేసీఆర్‌కు లేఖలు రాసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ములకలపల్లి రాములు, మేదరమెట్ల వెంకటేశ్వర రావు, కోట గోపి, రవినాయిక్, దేవరం వెంకటరెడ్డి, మిట్టగణపుల ముత్యాలు, చందా చంద్రయ్య, డి.స్టాలిన్‌రెడ్డి, షేక్ సైదా పాల్గొన్నారు.

వరి వైపే రైతుల మొగ్గు

- యాసంగి సాగు అంచనా 4.51లక్షల ఎకరాలు
- ఇప్పటి వరకు 2.70లక్షల ఎకరాల్లో వరి
- 50శాతం పంటల సాగు పూర్తి



పర్సాయిపల్లి సమీపంలో సాగులో ఉన్న వరిపొలాలు

అర్వపల్లి: జిల్లాలో యాసంగి సీజన్‌లో పంటల సాగు ఊపందుకుంది. నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ, మూసీనది జలాలు వస్తుండటంతో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. అయితే వరినాట్లకు కూలీలు దొరక్క అవస్థలు పడుతున్నారు. కాగా కొంతమంది రైతులు వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్ విధానం ద్వారా వరి వేస్తుండడంతో వారి వరినాట్ల ప్రక్రియ పూర్తయ్యింది. కూలీలతో వరినాట్లు వేయించేవారికి మాత్రం జాప్యం జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 50శాతం వరకు పంటలసాగు పూర్తి కావొచ్చింది. ఈ సీజన్‌లో ఎక్కువగా వరిసాగుపైనే దృష్టి పెట్టారు.

నీళ్లు పుష్కలంగా ఉండడంతో..

ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ, మూసీనది కింద 4.51లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని, వీటిలో వరి 4,49,800 ఎకరాలు, వేరుశనగ, పెసర, ఉలువలు తదితర పంటలు 1,200 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. కాగా వీటిలో ఇప్పటికే 2.70లక్షల ఎకరాలు వరి, 500 ఎకరాల్లో వేరుశనగ, పెసర, ఉలువలు తదితర పంటలు సాగయ్యాయి. తుంగతుర్తి నియోజకవర్గం పూర్తిగా, సూర్యాపేటలో కొంతభాగం, కోదాడ నియోజకవర్గంలో కొంత భాగం ఎస్సారెస్పీ జలాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ఇక సూర్యాపేట నియోజకవర్గంలో మూసీనదిపై, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో సాగర్ ప్రాజెక్ట్ నీటిపై ఆధారపడి పంటలు వేస్తున్నారు. గతేడాది యాసంగిలో జిల్లాలో 4.60లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. గతంలో మాదిరిగానే ఈసారి పంటలు చెబుతున్నారు.

గోదావరి జలాలపై ఆధారపడి సాగు



పూర్తిగా గోదావరి జలాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నాను. మూడు ఎకరాల భూమి ఈసారి సాగు చేస్తుండగా ఎస్సారెస్పీ నీళ్లు విడుదల య్యాకే పొలం దున్నుకొని వరినాట్లు వేస్తున్నాం. వారబందీ విధానం కాకుండా నిరంతరం ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి.

– కదారి యాగానందం, రైతు, అర్వపల్లి

అధికారుల సలహాలు పాటించాలి



జిల్లాలో ఈ యాసంగిలో రైతులు ఎక్కువగా వరి వంట వేయడానికే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే 50 శాతం మేర వివిధ పంటల సాగు పూర్తయ్యింది. రైతులు రైతులు వ్యవసాయ అధికారులు సలహాల మేరకు పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

– రామారావునాయక్, డీఏఓ

మధ్యాహ్న భోజన బిల్లుల పెంపు

- గత ఏడాది అక్టోబర్ 1నుంచి అమలులోకి
- 975 వంట ఏజెన్సీలకు ఊరట
- మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం



పసునూర్ మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు భోజనం పెడుతున్న ఏజెన్సీ నిర్వాహకులు

నాగారం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనానికి సంబంధించిన స్లాబ్ ధరలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొంత కాలంగా సకాలంలో ఏజెన్సీలకు వేతనాలు, బిల్లులు రావడం లేదని, పెరిగిన ధరలతో నిర్వహణ భారంగా మారిందని నిర్వాహకుల నుంచి ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మధ్యాహ్న భోజన ధరలను పెంచింది.

పెరిగిన ధరలు (రూ.లలో)

తరగతులు	గతంలో రేట్లు	పెంచిన ధరలు
1-5	4.97	5.46
6-8	7.45	8.17
9-10	9.95	10.67

ఈ పెరిగిన రేట్లు 2022 అక్టోబర్ 1నుంచి అమలులోకి తీసుకొస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. పౌష్టికాహారం లక్ష్యంగా అందిస్తున్న మధ్యాహ్న భోజనానికి అవసరమైన బియ్యాన్ని ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. కూరగాయలు, కోడిగుడ్లు, ఏజెన్సీ నిర్వాహకులు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మధ్నాహ్న భోజన మెనూ ప్రకారం వారంలో మూడు రోజుల పాటు విద్యార్థులకు ఉడికించిన కోడిగుడ్లు ఇవ్వాలి. అలాగే రోజూ ఒక కూర తప్పని సరిగా ఉండాలి. అయితే బిల్లులు సకాలంలో అందకపోవడం, అప్పుతెచ్చి భోజనం వడ్డించడం ఇబ్బందికరంగా మారిన నేపథ్యంలో మెనూ పాటించడం లేదనే విషయం స్పష్టమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలనే ఉద్దేశంతో గత అక్టోబర్-1 నుంచి ధరలు పెంచింది. పెగిరిన ధరల ప్రకారం ఏజెన్సీలకు బిల్లులు చెల్లించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

మూడు నెలల బిల్లులు మళ్లీ సమర్పించాలి

జిల్లాలో 936 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చదువుకుంటున్న విద్యార్థులు 75,605 మంది ఉన్నారు. 975 వంట ఏజెన్సీలు ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఈ ఏజెన్సీలకు లబ్ధిచేకూరనుంది. గతేడాది అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించి పెరిగిన ధరలను ఏజెన్సీలకు అందించనున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందే అవకాశముంటుంది. అలాగే ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గతేడాది అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన బిల్లులను ఏజెన్సీలు గతంలోనే సమర్పించినా... ధరల పెంపుతో మళ్లీ బిల్లులు సమర్పించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సూచిస్తున్నారు. ఆయా నెలల్లో విద్యార్థుల సంఖ్యకు పెంపు మొత్తాన్ని గుణించి బిల్లులు సమర్పిస్తే ఆయా మొత్తాన్ని ఏజెన్సీల ఖాతాల్లో జమ చేసే అవకాశం ఉంటుంది.

నాణ్యమైన భోజనం అందించాలి



ప్రభుత్వం మధ్యాహ్న భోజన ధరలు పెంచినందున విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి. వంట ఏజెన్సీలు మెనూ తప్పనిసరిగా పాటించాలి. విద్యార్థులకు వారానికి మూడు సార్లు కోడిగుడ్లు ఇవ్వాలి. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవు.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

క్లుప్తంగా

పత్తిని ఎత్తుకెళ్లిన దొంగలు

మునుగోడు: ఓ రైతు తన వ్యవసాయ బావివద్ద దాచిన పత్తిని దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన బుధవారం రాత్రి మునుగోడులో చోటుచేసుకుంది. వివరాలు.. మునుగోడు గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిగూడేనికి చెందిన ఉప్పునూతల యాదయ్య తన మూడెకరాల భూమిలో పత్తి సాగు చేయగా 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మంచి రేటు వచ్చినప్పుడు అమ్ముదామని ఆ పత్తిని తన వ్యవసాయ బావి వద్ద ఉన్న ఓ గదిలో వేసి తాళం వేశాడు. ఇది గమనించిన దొంగలు బుధవారం రాత్రి ఆ గది తాళం పగులగొట్టి పత్తిని అంతా ఓ వాహనంలో వేసుకొని ఎత్తుకెళ్లారు. యాదయ్య ఉదయం వచ్చి చూసేసరికి గది తాళం పగులగొట్టి ఉండటంతో పాటు గదిలో పత్తి లేకపోవడంతో విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశాడు.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి


బెడద సతీష్ (ఫైల్)

మద్దిరాల (తుంగతుర్తి): ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని రెడ్డిగూడెం శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన బెడద సతీష్(43) ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. గురువారం గ్రామ శివారులో ఓ రైతు పొలం దున్నుతుండగా అకస్మాత్తుగా ట్రాక్టర్ తిరగబడడంతో సతీష్ ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను తొలగించి మృతదేహాన్ని బయటికి తీసి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

‘తలసేమియా’తో తీరని శోకం

- ఇద్దరు కుమార్తెలను కోల్పోయిన దంపతులు
- కుమారుడికి కూడా అదే వ్యాధి సోకడంతో తల్లడిల్లుతున్న కుటుంబం
- కూలీ పనులు చేసుకుంటున్న వారికి భారంగా మారిన వైద్య ఖర్చులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు


తలసేమియా వ్యాధితో బాధపడుతున్న యశ్వంత్

కన్నీటి గాథ

మునగాల(కోదాడ): రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద కుటుంబం వారిది. లక్షల్లో ఒకరికి వచ్చే తలసేమియా వ్యాధితో ఇప్పటికే ఇద్దరు కుమార్తెలను పోగొట్టుకున్నారు ఆ దంపతులు. కుమారుడికి కూడా అదే వ్యాధి సోకడంతో ఎలాగైనా అతడిని కాపాడుకోవాలని తాపత్రయపడుతున్నారు. వివరాలు.. సూర్యాపేట జిల్లా మునగాల మండలం తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వింజమూరి వెంకన్న, వెంకటమ్మ దంపతులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు శిరీష, మనీషా, లక్ష్మి, కుమారుడు యశ్వంత్ సంతానం. వీరిలో శిరీష, మనీషా, యశ్వంత్‌కు చిన్నతనంలోనే తలసేమియా వ్యాధి సోకింది. ఈ వ్యాధి బారిన పడి శిరీష తన ఏడవ ఏట, మనీషా తన పదవ ఏట మృతిచెందారు. కుమారుడు యశ్వంత్‌కు ఆరు నెలల వయస్సులోనే తలసేమియా వ్యాధి సోకగా, ప్రస్తుతం అతడికి 15 సంవత్సరాలు నిండాయి. పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు భరించలేక ఆ దంపతులు తమ ఇద్దరు కుమార్తెలను బతికించుకోలేకపోయారు. తమ కుమారుడి ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తూ ఉండడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. తమ కుమారుడి వయస్సు పిల్లలంతా పాఠశాలలకు వెళ్లి చదువుకుంటుంటే తను మాత్రం ఇంటి దగ్గరే ఉంటున్నాడని ఆ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెలా రక్తమార్పిడి కోసం రూ.5వేలు ఖర్చు అవుతుండడంతో ఆ దంపతుల కూలీ డబ్బులు వైద్య ఖర్చులకే సరిపోతున్నాయి. ఒకవైపు తమ కుమారుడి వైద్య ఖర్చులు భరించలేక మరోవైపు పూట గడవక ఇబ్బందులు పడుతున్నారు. దయార్ద్ర హృదయులు ఎవరైనా సాయం చేస్తే తమ కుమారుడిని మరికొంత కాలం బతికించుకుంటామన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. దాతలు ముందుకు వస్తే 8499094597కు సమాచారం ఇవ్వాలని వెంకన్న, వెంకటమ్మ దంపతులు వేడుకుంటున్నారు.

వింజమూరి వెంకటమ్మ (యశ్వంత్ తల్లి)	
బ్యాంకు ఖాతా నంబర్–	73150040539
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, మునగాల బ్రాంచ్	
ఐఎఫ్ఎస్‌సీ కోడ్:	ఏపీజీబీ0006210
సెల్ నంబర్:	8499094597

ఈ వ్యాధి శాపంగా మారింది



మాయదారి రోగం నా ఇద్దరు కూతుర్లను నాకు దూరం చేసింది. ఇప్పుడు మృత్యువుతో పోరాడుతున్న నా కుమారుడిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది. రెక్కాడితేగాని డొక్కాడని మా కుటుంబానికి ఈ జబ్బు శాపంగా మారింది. పగవాడికి కూడా ఇటువంటి పరిస్థితి కలగకూడదని ఆ భగవంతుడిని వేడుకుంటున్నాను.

– వెంకటమ్మ, యశ్వంత్ తల్లి

దాతలు సాయం చేయాలి



నా సోదరి కుమారుడిని బతికించుకోవడానికి లక్షల రూపాయలు అప్పుచేసినా ప్రాణాలు దక్కే పరిస్థితి లేదు. మృత్యువుకు దగ్గరలో ఉన్న ఆమె కుమారుడు కొంతకాలమైనా బతకాలనుకుంటే దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన విధంగా ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నాను.

– ముత్యాలు, యశ్వంత్ మేనమామ

‘కంటి వెలుగు’ను పకడ్బందీగా నిర్వహించాలి


మచన్‌పల్లిలో కళ్లజోళ్లు అందజేస్తున్న యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

బొమ్మలరామారం: కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బొమ్మలరామారం మండలంలోని మాచన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. కంటి పరీక్షల అనంతరం పలువురికి కళ్లద్దాలు అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా పరిశీలకురాలు డాక్టర్ స్వప్న, ఇంటలిజెన్స్ ఎస్ఐ మహ్మద్ ఉస్మాన్ పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో మండల నోడల్ అధికారి జ్యోతికుమార్, ఎంపీడీఓ సరిత, మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్, ఆయుష్ డాక్టర్ క్రాంతి, సుమలత, కిరణ్, పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సింహ, సర్పంచ్‌లు మహేష్‌గౌడ్, వట్టిపల్లి లక్ష్మి, ఉప సర్పంచ్ భరత్, వట్టిపల్లి సుదర్శన్, వైద్య సిబ్బంది జయశ్రీ, పంచాయతీ కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, పద్మ పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యంగా ‘కంటి వెలుగు’

- భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి


భువనగిరిలోని గంజ్ ఏరియాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి : అంధత్వ నివారణే లక్ష్యంగా టీఆర్ఎస్ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో గల శృతినగర్, 17వ వార్డులోని గంజ్ ఏరియాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని డీసీపీ నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యపరీక్షలు చేసి కళ్లద్దాలు ఇస్తున్నట్లు తెలిపారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, రైతు సమన్వయ సమితి జిల్లా కో ఆర్డినేటర్ కొల్పుల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కిష్టయ్య, కౌన్సిలర్ చెన్న స్వాతి మహేష్, టీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గాదె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య

- సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగిలో ఘటన
- మృతురాలి సొంతూరు సూర్యాపేట జిల్లా మోతె మండలం హుసేనాబాద్

పటాన్‌చెరు టౌన్: సూర్యాపేట జిల్లా మోతె మండలానికి చెందిన మహిళ మానసికస్థితి సరిగాలేక అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ రామానాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతె మండలం హుసేనాబాద్ గ్రామానికి చెందిన పరశురామ్ బతుకుదెరువు నిమిత్తం వలస వెళ్లి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని కేవీఆర్ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇతడి రెండో కుమార్తె నవ్య(25)ను స్వగ్రామం హుసేనాబాద్‌కే చెందిన కిరణ్‌కు ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. పరశురామ్ అల్లుడు కిరణ్ కూడా ముత్తంగిలోనే పక్క అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. కాగా కొంతకాలంగా నవ్య అనారోగ్యంతో బాధపడుతోంది. మతిస్థిమితం లేక ఆమె గతంలో రెండుసార్లు ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో గురువారం అపార్ట్‌మెంట్ 5వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్య సమస్యతో తన కూతురు ఆత్మహత్య చేసుకుందని తండ్రి పరశురామ్ పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ ఉద్యోగార్థులకు న్యాయం చేయండి

- యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి
- అడ్డుకొని అరెస్ట్ చేసిన పోలీసులు


నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నల్లగొండ: పోలీస్ ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవకతవకలను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ను ముట్టడించారు. ముందుగా డైట్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ క్రమంలో లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన వారందరినీ పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో కూడా నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజా రమేష్ యాదవ్ మాట్లాడుతూ పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు జరిగాయని, హైకోర్టు తీర్పు ప్రకారం 7 మార్కులను కలపాలని చెప్పినప్పటికీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కఠిన నిబంధనల కారణంగా నష్టపోయే పోలీస్ ఉద్యోగార్థులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు న్యాయం చేయకుంటే యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరుద్యోగులతో కలిసి ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శులు కొర్ర రాంసింగ్ నాయక్, జరుప్ల లక్ష్మి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీధర్ నాయక్, నల్లగొండ టౌన్ అధ్యక్షుడు గాలి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమేర్ కాశీం, దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, మిర్యాలగూడ అధ్యక్షుడు అజార్, నకిరేకల్ అధ్యక్షుడు గుండ జలెందర్ రెడ్డి, మర్రి దేవేందర్ యాదవ్, మామిడి కార్తీక్, అజారుద్దీన్, ముని నాయక్, కుర్ర నాగరాజు నాయక్ అభిషేక్, చిత్రం రమేష్, నవీన్, అంజన్, తబ్రేజ్, అర్జున్, సతీష్ ,యేసు రాజు, అవినాష్, సాయి తదితరులు పాల్గొన్నారు.


నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

శ్రవణ్‌రెడ్డి మృతిపై కేసు నమోదు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం తిప్పలమ్మగూడెం గ్రామానికి చెందిన వల్లపురెడ్డి శ్రవణ్‌రెడ్డి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోగా గురువారం అతడి తల్లి జానకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం ఆర్లగడ్డగూడెం గ్రామానికి చెందిన బాలికతో ప్రేమ వ్యవహారంలో 2021 అక్టోబర్ నెలలో శ్రవణ్‌రెడ్డిపై కేసు నమోదు కాగా, అతడికి మూడు నెలలు జైలుశిక్ష పడింది. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి శ్రవణ్‌రెడ్డి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడంతో చికిత్స నిమిత్తం నల్లగొండ ఆస్పత్రికి తరలించగా బుధవారం సాయంత్రం మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

దొంగను చితకబాది పోలీసులకు అప్పగింత

నల్లగొండ క్రైం: నల్లగొండ మండలంలోని దీపకుంట గ్రామానికి చెందిన గూడూరు మనీలా నివాసంలో గురువారం చోరీకి యత్నించిన దొంగను గ్రామస్తులు చితకబాది పోలీసులకు అప్పగించారు. నల్లగొండ రూరల్ ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనీలా ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లగా చండూరుకు చెందిన మధు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి యత్నించాడు. శబ్దం రావడంతో ఇంటి చుట్టుపక్కల వారు గమనించి మధును పట్టుకుంటుండగా తన వద్ద ఉన్న చాకుతో బెదిరించాడు. దీంతో గ్రామస్తులు కర్రలతో దాడి చేసి మధును పట్టుకుని నల్లగొండ రూరల్ పోలీసులకు అప్పగించారు. దొంగకు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు బోల్తా.. వ్యక్తి మృతి


వెంకన్న (ఫైల్)

మునుగోడు: కారు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘట న గురువారం మునుగోడు మండలంలోని సింగారం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన కట్లకుంట్ల వెంకన్న(42) ఊర్లో కిరాణ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మునుగోడులో సంత కావడంతో కూరగాయలతో పాటు ఇతర సరుకులు తెచ్చేందుకు తన కారులో వెళ్లాడు. సరుకులు తీసుకుని ఊకొండికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో సింగారం గ్రామం దాటిన తర్వాత మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి వరి పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో కారు బోల్తా పడటంతో వెంకన్న తల పొలంలో చొచ్చుకుపోయి ఊపిరి ఆడక పోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ డి. సతీష్‌రెడ్డి తెలిపారు.

ఉద్యమ ఆకాంక్షల సాధనకు పునరంకితం కావాలి


వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలంగాణ జనసమితి నాయకులు

భానుపురి (సూర్యాపేట): తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల కోసం పునరంకితం కావాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మార్జున్ పిలుపునిచ్చారు. తెలంగాణ మలిదశ అమరుడు కొండేటి వేణుగోపాల్‌రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను ముఖ్యమంత్రి కేసీఆర్ తన స్వార్థం కొరకు ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ అమరుల రక్తపు మరకలతో అధికారాన్ని చేజిక్కించుకున్న కేసీఆర్ ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ సభలో కనీసం అమరులకు నివాళులర్పించలేదని, జై తెలంగాణ నినాదం ఇవ్వడానికి కూడా సిగ్గుపడ్డాడని, ఇది మొత్తం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినట్లుగానే తెలంగాణ సమాజం భావిస్తుందన్నారు. కేసీఆర్ బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు మాండ్ర మల్లయ్య, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెలంగాణ అమరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్ధారెడ్డి, తెలంగాణ జనసమితి లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ కొంచెం చంద్రకాంత్, దైద వెంకన్న, బండి రవి, తెలంగాణ జన సమితి పట్టణ అధ్యక్షుడు బంధన్ నాయక్, బొడ్డు శంకర్ గౌడ్, ఈశ్వర్ సింగ్, నక్క సాయి, బిను స్వామి, ఖలీల్ హమీద్, దేవత్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలంతో రూ. 9.35 లక్షలు ఆదాయం

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ ఎక్సైజ్ పరిధిలో వివిధ కేసులల్లో సీజ్ చేసిన వాహనాలకు గురువారం హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ అధికారి కె. అనిత ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. 21 వాహనాలకు వేలం నిర్వహించగా రూ 9.35లక్షల ఆదాయం ప్రభుత్వం ఖజానాకు సమకూరిందని తెలిపారు. సుమారు రూ.3లక్షల ఆదాయం లభిస్తుందని అంచనా వేయగా 3 రెట్లు అధికంగా ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఏలె శ్రీనివాస్, ఎస్ఐలు సతీష్‌రెడ్డి, వెంకన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వేలం నిర్వహిస్తున్న సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ అధికారి అనిత తదితరులు

పుచ్చపంట సాగుతో లాభాల బాట

- యాభై ఎకరాల్లో సాగు చేస్తున్న బుడ్డారెడ్డిగూడెం రైతు
- ఎకరాకు రూ.లక్ష నికర ఆదాయం

పాడి పంట

గుర్రంపోడు: మండలంలో పుచ్చకాయ సాగు విస్తీర్ణం గత రెండేళ్లుగా రికార్డు స్థాయిలో పెరుగుతుంది. రెండు నెలల్లో ఆదాయం వచ్చే ఈ పంటను మండలంలో దాదాపు వెయ్యి ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు అంచనా. నీటి వసతి గల చోట్ల పత్తి కట్టెను తొలగించి రైతులు పుచ్చసాగుకు సిద్ధపడుతున్నారు. అంతేకాకుండా బత్తాయి తోటల్లో అంతర పంటగా పుచ్చ సాగు చేపడుతున్నారు. మల్చింగ్ షీట్‌లు, డ్రిప్ వంటి ఆధునిక పద్ధతుల ద్వారా విరివిగా పుచ్చసాగు చేస్తూ రైతులు లాభాలు గడిస్తున్నారు. మండలంలోని కొప్పోలు గ్రామ పరిధిలోనే రెండు వందల ఎకరాల్లో పుచ్చసాగు చేస్తున్నారు. బుడ్డారెడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతు బొల్లం యాదయ్య భూములు కౌలుకు తీసుకుని 50 ఎకరాల్లో పుచ్చ సాగు చేస్తూ ఇతర రైతులకు మార్గదర్శకుడిగా నిలుస్తున్నాడు.


కొప్పోలులో సాగవుతున్న పుచ్చ పంట

పదేళ్ల అనుభవం

గత పదేళ్లుగా రైతు బొల్లం యాదయ్య నవంబర్ నెల నుంచి జూన్ వరకు భూములు కౌలుకు తీసుకుని పలు దఫాలుగా పుచ్చసాగు చేస్తున్నాడు. కొప్పోలు పరిధిలో చాలా గ్రామాల్లో కౌలు దొరికిన చోటల్లా పుచ్చసాగు చేస్తూ ప్రతిరోజూ పది మంది కూలీలకు వరుసగా ఆరు నెలలు ఉపాధి కల్పిస్తున్నాడు. నీటి సదుపాయం ఉన్న చోట్ల ఎకరాకు ఎనిమిది వేల వరకు భూములు కౌలుకు తీసుకుని మల్చింగ్ షీట్లు, డ్రిప్ ఏర్పాటు చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పుచ్చసాగు చేస్తున్నాడు. ప్రస్తుతం తేనపల్లి గ్రామంలో 10ఎకరాల్లో తాను సాగు చేసిన పుచ్చ పంట కోత దశలో ఉందని రైతు యాదయ్య తెలిపారు. ఎక్కువగా మెలికానా క్యాండీ, బాహుబలి–2 రకం పుచ్చను సాగుచేస్తున్నానని, వివిధ దశల్లో మార్చి నెలాఖరు వరకు గింజలు నాటుతానని ఆయన పేర్కొన్నారు.

రూ. లక్ష ఆదాయం వచ్చింది



ఎకరా భూమిలో పుచ్చసాగు చేస్తే రెండున్నర నెలల్లోనే రూ.లక్ష నికర ఆదాయం లభిస్తుంది. ఎకరాకు సాధారణ దిగుబడి 25 నుంచి 30 టన్నులు కాగా, తోటల వద్ద కిలోకు రూ.8 నుంచి రూ.10 చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రూ.8 లెక్కన చూసుకున్నా ఎకరాకు మొదటి కోతలో 20టన్నుల దిగుబడి రాగా రూ.1.60లక్షలు ఆదాయం వచ్చింది. రెండో దిగుబడి(చిన్నసైజు కాయలు)లో కిలో రూ.4 లెక్కన పది టన్నులకు రూ.40వేలు ఆదాయం లభిస్తుంది. మొత్తం రెండు దఫాల్లో ఎకరాకు వచ్చే రూ.70వేలు పెట్టుబడి పోగా రూ.1.30లక్షలు ఆదాయం వస్తుంది. ధర, దిగుబడుల్లో తేడాలు వచ్చినా రూ.లక్ష నికర ఆదాయం లభిస్తుంది.

– బొల్లం యాదయ్య, రైతు, బుడ్డారెడ్డిగూడెం